నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: 33/11 కేవీ మల్లాపూర్ బెల్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ భవనీనగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు భవానీనగర్, కెఎల్‌రెడ్డినగర్, హెచ్‌సీఎల్ కాలనీ, మల్లాపూర్ విలేజ్ పార్క్, ఎస్వీనగర్, మ్‌లెప్లవర్ పార్క్, మల్లాపూర్ మజీద్, పఠాన్ బస్తీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ తెలిపారు.

రైల్వే సమస్యల పరిష్కారానికి కృషి

అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలో రైల్వే సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి జీఎంతో పాటు, హైదరాబాద్ డీఆర్‌ఎం సంతోష్‌కుమార్ వర్మ, సికింద్రాబాద్ డీఆర్‌ఎం గోపాలకృష్ణన్‌లను కలిసి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వాజ్‌పేయ్‌నగర్ ఆర్‌యూబీ నిర్మాణానికి, జనప్రియ అపార్ట్ మెంట్స్ వద్ద ఆర్‌యూబీ అభివృద్ధి పనులు, బొల్లారం రైల్వే బజార్, కొత్తబస్తీ బజార్‌లో డ్రైనేజీ సమస్య, భూదేవినగర్ సమీపంలో రైల్వే డ్రైనేజీ, ఆర్కేపురం ఫ్లైఓవర్ నిర్మాణానికి డ్రాయింగ్స్ ఆమోదం తదితర సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు అనిల్ కిషోర్‌గౌడ్, జీకె.హన్మంత రావు, అమీనుద్దీన్, మేకల రాముయాదవ్, చిన్నయాదవ్, భాగ్యనందరావు, వంశీ ముదిరాజ్, రాజశేఖర్‌రెడ్డి, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రింగ్ మెటీరియల్ కొనొద్దు

అల్వాల్: సెంట్రింగ్ మెటీరియల్ ఎవరూ కొనరాదని లోతుకుంట సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నేతలు అన్నారు. సోమవారం అల్వాల్ శ్రీసాయినగర్ ఎన్‌క్లేవ్‌లో అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన అల్వాల్ సీఐ ప్రశాంత్, డీఐ తిమ్మప్ప మాట్లాడుతూ.. ఇటీవల కొందరు వ్యక్తులు సెంట్రింగ్ సామాన్లను చోరీ చేసి అమ్ముకుంటున్నారని, దాని వల్ల కొన్నవారు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. చోరీ చేసిన సెంట్రింగ్ బాక్సులు, మెటీరియల్ స్క్రాప్ దుకాణదారులు ఎవరు కొనవద్దని తద్వారా దొంగలను పట్టుకోవచ్చన్నారు. సమావేశంలో గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చాంద్ పాషా, స్క్రాప్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కొడాలి సత్యనారాయణ, కృష్ణ, నర్సింహ, చంద్రశేఖర్, మహేష్, రవి, రాజు, శివ, రాజయ్య, రాజేందర్, రవి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



ఉప్పల్: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. సోమవారం చిలుకానగర్ డివిజన్ గణేష్‌నగర్‌కు చెందిన మల్లేష్, సంధ్యకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ ధనుంజయ

మల్లాపూర్: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నాచారం ఇన్‌స్పెక్టర్ కె.ధనంజయ అన్నారురు. సోమవారం రహేజా అపార్ట్‌మెంట్ వాసులకు సైబర్ నేరాలు, కమ్యూనిటి సెఫ్టీ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



సుకుమారన్ (ఫైల్)

అల్వాల్: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. చంద్రగిరి కాలనీలో నివసించే కేరళకు చెందిన సుకుమారన్ (62) స్థానికంగా దుస్తుల వ్యాపారం చేస్తున్నాడు. కొంతకాలంగా ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న సుకుమారన్ సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమార్తె వైష్ణవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



స్వర్ణ కవచాలంకృత అలంకరణలో



మారుతీనగర్‌లో..



జ్ఞాన సరస్వతీ దేవిగా అమ్మవారు



మల్లన్న దేవాలయంలో..

ఘనంగా దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం



అంబా భవాని ఆలయంలో..

విజయదశమి వేడుకల్లో భాగంగా సోమవారం మల్కాజిగిరి, ఉప్పల్ నియోజకవర్గాల పరిధిలోని పలు దేవాలయాలు, మండపాల్లో శరన్నవ రాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అనంత సరస్వతీనగర్‌లోని జ్ఞానసరస్వతీ దేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మారుతీనగర్ ఆంజనేయస్వామి దేవాలయంలో అమ్మవారు బాలాత్రిపురసుందరిగా దర్శనమిచ్చారు.

– మల్కాజిగిరి, ఉప్పల్ జోన్ బృందం



మల్లాపూర్‌లో..

అన్ని రంగాల్లో నియోజకవర్గ అభివృద్ధికి కృషి

కుషాయిగూడ: ఉప్పల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు శాయశక్తుల కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం ఆయన మీర్‌పేట్-హెచ్‌బీ కాలనీ డివిజన్, హెచ్‌బీకాలనీ ఫేజ్-1లో నిర్మించనున్న మంచినీటి పైప్‌లైన్ పనులను కార్పొరేటర్లు ప్రభుదాస్, పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో చాలా రోజుల క్రితం వేసిన మంచినీటి, డ్రైనేజీ పైప్‌లైన్ల వ్యవస్థే ఉందన్నారు. దీంతో తరచూ పైపులు పగిలి, మంచినీరు కలుషితం కావడం, డ్రైనేజీ పొంగి పొర్లడం జరుగుతుందన్నారు. వాటిని దశలవారీగా క్రమబద్ధీకరించి అవసరాలకు తగ్గట్టుగా పైప్‌లైన్ల సామర్థ్యం పెంచనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ ఏఈ వేణుగోపాల్, బీఆర్‌ఎస్ నేతలు, స్థానికులు బోదాసు లక్ష్మీనారాయణ, నేమూరి మహేష్‌గౌడ్, శివరాంప్రసాద్, గోవిందరెడ్డి, ప్రసాద్, రమణ, శివ, దుర్గయ్య, నరేందర్, నిస్సార్ అహ్మద్‌గోరి తదితరులు పాల్గొన్నారు.



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి..

ముంపు సమస్యపై మంత్రికి వినతి

కుషాయిగూడ: చిన్నపాటి వర్షం కురిసినా చర్లపల్లి డివిజన్‌లో పలు కాలనీలు ముంపునకు గురై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన మంత్రి శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. డివిజన్ పరిధిలోని సాయినగర్, కృష్ణారెడ్డినగర్, నాగార్జుననగర్, శివసాయినగర్‌తో పాటుగా సమీప కాలనీలు తరచూ ముంపునకు గురవుతున్నాయని, దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని మంత్రిని కోరారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలైన ఈసీఐఎల్, టీఐఎఫ్‌ఆర్ నుంచి భారీగా వరదనీరు వచ్చి సాయినగర్, కృష్ణారెడ్డినగర్ కాలనీల మీదుగా కింది కాలనీలను ముంచెత్తుతుందన్నారు. దీంతో కుషాయిగూడ-నాగారం ప్రధాన రోడ్డుపై వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రత్యేక నిధులు కేటాయించి వరదనీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మంత్రిని కోరారు. డివిజన్ బీఆర్‌ఎస్ నేత నేమూరి మహేష్‌గౌడ్ ఉన్నారు.

పరామర్శ

కుషాయిగూడ: బస్ డిపోలో చోటు చేసుకున్న ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బీఆర్‌ఎస్ నాయకురాలు అమ్మనబోయిన భవాని కుమారుడు దీపక్‌ను సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్ పరామర్శించారు. ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్న ఆయన మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మౌలాలి: డివిజన్ పరిధిలోని సాయినాథపురంలో రూ.25 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాల నేపథ్యంలో స్థానికుల సౌకర్యార్థం రోడ్డు పనులు ప్రారంభినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ వాసులు అమర్నాథ్, సతీష్, భగీరథ, శివ, రాజు, బలరాం, అమీనుద్దీన్, భాగ్యానందరావు తదితరులు పాల్గొన్నారు.

నీరు నిలువ ఉండకుండా ప్రత్యేక చర్యలు

గౌతంనగర్: వర్షపు నీరు నిలువ ఉండకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ మేకల సునీతరాముయాదవ్ తెలిపారు. సోమవారం ఆమె గౌతంనగర్ డివిజన్ పరిధిలోని వాణినగర్, మౌలాలి రైల్వే పట్టాల సమీపంలో నిలిచిన వర్షపు నీటిని కాలనీ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. రైల్వే స్థలాల్లో పాటు వర్షపు నీరు నిలుస్తున్న ప్రాంతాలను గుర్తించి వర్షపు నీరు నిలువ ఉండకుండా కొత్త టన్నెల్ వాల్స్ ఏర్పాటు చేయాలని అధికారులను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కాలనీ అసోసియేషన్ వాసులు నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న మాజీ మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: డివిజన్ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. సోమవారం ఆయన 1వ డివిజన్ రాజేష్‌నగర్ కాలనీలో రూ. 40లక్షలతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన, ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దశల వారీగా మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుధ్య, విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం ప్రారంభించిన పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు బింగి జంగయ్యయాదవ్, కొత్త చందర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్‌గౌడ్, మాజీ వార్డు సభ్యులు కుర్రి శివశంకర్ పాల్గొన్నారు.

వరద ప్రాంతాల్లో సహాయక చర్యలు


కుషాయిగూడ: చర్లపల్లి, మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్లలో భారీ వర్షం కారణంగా దెబ్బతిన రోడ్లు, పొంగి పొర్లుతున్న మ్యాన్‌హోల్స్ మరమతు తదితర సహాయక కార్యక్రమాలను మాన్సూన్ టీం చేపట్టింది. కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, ప్రభుదాస్ ఆయా డివిజన్‌లలో సహాయక చర్యలను పరిశీలించి తగిన సూచనలు, సలహాలు చేశారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. భారీ వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తమంగా ఉండాలన్నారు. అత్యవసరమైతే కాని బయటకు రావద్దన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు

మల్లాపూర్: మల్లాపూర్ సూర్యనగర్‌లోని మోడ్రన్ స్కూల్‌లో సోమవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన 320 సీ డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ ఇన్నారెడ్డి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ హైద్రాబాద్, మీర్‌పేట్ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, పాతశాల ఫౌండర్ ఛైర్మన్ ముత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో...

నాచారం భవానీనగర్ రోడ్ నెంబర్ -1 లో బతుకమ్మ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దాదాపు 15 అపార్ట్‌మెంట్లకు చెందిన మహిళలు కార్యక్రమంలో పాల్గొన్నారు. డ్యాన్స్ మాస్టర్ అంజలి, చీనాల అన్నపూర్ణ, అశ్విని,రాధామణి, మంజుల,రచన, శిల్ప., శృతి, మాధవి, తదితరులు ఉన్నారు.



భవానీనగర్‌లో..



మల్లాపూర్ మోడ్రన్ స్కూల్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు.

హైడ్రా సిబ్బందిని పెంచాలి



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ పలు ఫిర్యాదులు చేశారు. హైడ్రా సిబ్బందిని పెంచడంతో పాటు జీహెచ్‌ఎంసీ సిబ్బందితో సమన్వయం చేసి పనిచేసేలా చూడాలన్నారు. గ్రీన్ వేస్ట్ తొలగింపులో అలసత్వం వహిస్తున్నారని, వీధి కుక్కల నియంత్రణకు స్పెషల్ డ్రైవ్, సర్కిల్ కార్యాలయంలోనే సీనియర్ సిటిజన్ కార్డులు అందజేయాలని, ఎస్పీనగర్ శ్మశానవాటికలో ప్రస్తుతం ఉన్న కాటి కాపరిని మార్చాలని కోరారు.

తల్లిదండ్రుల హత్య కేసులో నిందితుడి రిమాండ్

అల్వాల్: తల్లిదండ్రులను హత్య చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సాయినగర్‌లో నివసించే రాజయ్య, లక్ష్మీ దంపతుల కుమారుడు శ్రీనివాస్ ఆదివారం మద్యం మత్తులో తల్లిదండ్రులతో గొడవపడి వారిపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన వారు ఇరువురూ మృతి చెందారు. దీనిని గుర్తించిన స్థానికులు శ్రీనివాస్‌ను చితకబాది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు సోమవారం కోర్టులో హాజరుపరిచారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం అతడికి రిమాండ్ విధించింది.

పేకాటరాయుళ్ల అరెస్ట్

రూ.12 వేల నగదు స్వాధీనం

మల్లాపూర్: నాచారం పారిశ్రామిక వాడలో పేకాట ఆడుతున్న వ్యక్తులను నాచారం పోలీసులు ఆదివారం రాత్రి అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నాచారం పారిశ్రామికవాడలోని బయోటెక్నాలజీ రోడ్ నెంబర్ 15లో ఖాళీ స్థలంలో ఆదివారం రాత్రి ఏడుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో నాచారం పోలీసులు దాడి చేసి వారి నుంచి రూ.12,830, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యం వికటించి చిన్నారి మృతి

బోడుప్పల్: జ్వరంతో క్లినిక్‌కు వెళ్లిన ఓ చిన్నారి వైద్యం వికటించి మృతి చెందిన సంఘటన సోమవారం మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సరూర్‌నగర్‌కు చెందిన కొండా నాగరాజు, లావణ్య దంపతుల కుమార్తె హాసిని (6) గత పది రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. నాగరాజు తమ్ముడు వీరబాబు సలహా మేరకు బాలికను ఆదివారం బోడుప్పల్‌లోని సత్యాపాలీ క్లినిక్‌కు తీసుకొచ్చారు. చికిత్స చేస్తుండగా హాసిని మృతి చెందింది. నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్లినిక్ సీజ్ ..

అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఇన్‌చార్జి డాక్టర్ ప్రణీత్, డిప్యూటీ డిస్ట్రిక్ ఎక్స్‌టెన్షన్ మీడియా ఆఫీసర్ వసంతరెడ్డి సోమవారం బోడుప్పల్‌లోని సత్యా పాలీ క్లినిక్ తనిఖీ చేసి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా క్లినిక్ రిజిస్టర్ కాలేదని, పీడియాట్రిక్ లేదా క్రిటికల్ కేర్ సదుపాయాలు లేవని, ఇక్కడ పని చేసే వ్యక్తి తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్‌లో నమోదు పొందిన డాక్టర్ కాదని గుర్తించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ కింద క్లినిక్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు.

పెండింగ్ పనులపై దృష్టి సారించండి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో పెండింగ్ పనులపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో డీఈ జకియా సుల్తానా, ఈఈ లక్ష్మణ్, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని డివిజన్లలో పెండింగ్‌లో ఉన్న బాక్స్ డ్రైన్లు ,సీసీరోడ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. వినాయకనగర్ డివిజన్ దీన్‌దయాళ్‌నగర్‌లో నాలా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. నాలాల్లో పూడిక తీయకపోవడం వల్లనే ముంపునకు గురవుతున్నామని కాలనీ వాసులు ఫిర్యాదు చేస్తున్నారని పూడిక తొలగింపుపై దృష్టి సారించాలన్నారు. వర్షాల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు, అత్యవసర సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో డీఈలు మహేష్,లౌక్య, ఏఈలు సత్యలక్ష్మి, మధురిమ, నవీన్ పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన

ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఎన్ఎండీసీ కాలనీ జలమయమమైన నేపథ్యంలో ఎమ్మెల్యే ఇంజినీరింగ్ అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. సమస్యకు కారణాలు అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, బండ చెరువు నుంచి నీరు ఎక్కువగా వస్తే కాలనీ మునిగి పోతుందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకొనివచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శాశ్వత పరిష్కారంలో భాగంగా డ్రైనేజీ వ్యవస్థ పునఃనిర్మాణం, సాఫీగా నీరు వెళ్లడానికి చర్యలు అవసరమని అందుకు అధికారులను తగిన ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

రూ.1.3 కోట్లతో అభివృద్ధి పనులు



కాప్రా డివిజన్‌లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి

కాప్రా: కాప్రా డివిజన్ పరిధిలో రూ.1.3 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు స్థానిక కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి తెలిపారు. సోమవారం డివిజన్‌లో పర్యటించిన ఆయన పలు కాలనీల్లో అభివృద్ధి పనులను ప్రారంభించారు. షిరిడీనగర్‌లో రూ. 30 లక్షలు, ఆర్టీసీ కాలనీలో రూ. 25 లక్షలు, వినాయక్‌నగర్‌లో రూ. 10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే రూ. 65 లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించామని, త్వరలోనే మిగిలిన నిధులతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని, అందులో కాప్రా డివిజన్‌ను ప్రత్యేకంగా ప్రోత్సహిస్తుందన్నారు. డివిజన్‌లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, ప్రభుత్వ పెద్దలు వెంటనే స్పందించి నిధులు మంజూరు చేసి అభివృద్ధిని ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కాలనీ వాసులు రిజ్వాన్‌ఖాన్, సత్తిరెడ్డి, చెన్నారెడ్డి, నిఖిల్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు నాగేషు, నాగరాజు, పవన్, శ్రీధర్ రెడ్డి, సంతోష్, మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

కేన్సర్ స్క్రీనింగ్ శిబిరానికి విశేష స్పందన



ఉచిత కేన్సర్ శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ చేతన

రామంతాపూర్: స్వస్తి నారీ స్వశక్తి పరివార్ అభియాన్ ఆధ్వర్యంలో రామంతాపూర్ వెంకట్‌రెడ్డినగర్ ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ శిబిరానికి విశేష స్పదన లభించింది. ఈ సందర్భంగా దాదాపు 200 మంది మహిళలకు మౌలిక గర్భాశయ, రొమ్ము కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న ఆరోగ్య పథకాలను పేద, మధ్య తరగతి ప్రజలు ఉపయోగించుకుని లబ్ధి పొందాలని సూచించారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి మహిళలకు కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తే ఎంతో మంది పేద, మధ్య తరగతి మహిళలకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య శాఖ ఈసీ డైరెక్టర్ డాక్టర్ అనురాధ, జీహెచ్‌ఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మావతి, డాక్టర్ మల్లీశ్వరి, ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైజాగ్ అధికారి డాక్టర్ సౌశిల్య, వెంకట్‌రెడ్డినగర్ పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీప్రియ, డాక్టర్ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.